క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత 'పాగిరి'


ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు

రాజాం సిటీ: మండలంలోని పాగిరి గ్రామంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. సాయంత్రం పాగిరి-1, పాగిరి-2 జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో పాగిరి-1 జట్టు గెలుపొంది, టోర్నీ విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్టుకు నిర్వాహకులు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు.

దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బూరి మధుసూదనరావు

తెర్లాం: మండలంలోని విజయరాంపురంలో వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో భోగి పండగ సందర్భంగా పేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బూరి మధుసూదనరావు మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివేకానంద ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలజంగిలో నగర సంకీర్తన


అలజంగిలో నగర సంకీర్తన చేస్తున్న భజన మండలి సభ్యులు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగిలో భజన బృందాల సభ్యులు శనివారం నగర సంకీర్తన చేపట్టి ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ కార్యదర్శి ధూపం వాసు మాట్లాడుతూ భజనలు, మేలుకొలుపులు చేయడం వల్ల సమాజంలో ధార్మికభావన పెరుగుతుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి, హిందూధర్మ వ్యాప్తికి అందరూ కృషి చేయాలని సూచించారు. భీష్మ ఏకాదశి రోజున గ్రామంలో మహా అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తామని భజన బృందం సభ్యులు పైల వెంకటరమణ, శ్రీపతి శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


గొర్లె సీతారాంపురం కల్యాణ వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం కల్యాణ వేంకటేశ్వరాలయంలో, కలువరాయి గ్రామంలో గోదాదేవి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వరాలయంలో వేద పండితుడు భద్రం శ్రీకాంత్‌స్వామి వివాహ ఘట్టాన్ని కనులపండువగా చేపట్టారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ గాడి ప్రసాద్ కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలువరాయిలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వితరణ


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో 400 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాయాధికారి శాసపు వెంకటరమణ సమకూర్చిన దుస్తులను మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య శనివారం పంపిణీ చేశారు. పేదలను ఆదుకోవాలనే సదుద్దేశ్యంతో తన పెన్షన్‌లో నుంచి కొంత మొత్తాన్ని వెచ్చించి, ఇలా ప్రతిఏటా తన తండ్రి సూరప్పనాయుడు జ్ఞాపకార్థం వీటిని పంపిణీ చేస్తున్నట్లు దాత తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

తెర్లాం: మండలంలోని నందిగాంలో దోమల నివారణకు శనివారం ఫాగింగ్ చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ ఆర్నిపల్లి గంట, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పర్యవేక్షించారు.

భోగభాగ్యాల భోగి...

నాలుగు రోజుల సంక్రాంతి పండగ భోగీతో ఘనంగా మొదలైంది. సూర్యభగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించడాన్నే మకర సంక్రాంతి అంటారు. ఈ పండగకు ఒక్కరోజు ముందు భోగి పండగ చేసుకుంటారు. భోగి మంటల్లో పాత వస్తువులతో పాటు పశువుల పేడతో తయారు చేసిన పిడకలు వేయడం వల్ల గాలి శుద్ధి కావడంతో శ్వాస సంబంధిత వ్యాధులు రావనేది పెద్దల నమ్మకం. రంగనాథస్వామిలో గోదాదేవి ఐక్యమైన రోజు.. వామన అవతారంలో మహా విష్ణువు బలిచక్రవర్తిని పాతాళ లోకానికి పంపించిన రోజు.. శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తిన రోజు.. రైతుల కోసం ఈశ్వరుడు భూమి మీదకు నందిని పంపిన రోజు కూడా కావడంతో అన్ని వర్గాల ప్రజలు భోగిని ఘనంగా జరుపుకున్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా వాడవాడలా శనివారం వేకువజామున భోగి మంటలు వేశారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్


బొబ్బిలి రూరల్: భోగి మంట వద్ద ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు


రేగిడిలో వేసిన భోగి మంట


మెంటాడ: మండల కేంద్రంలో భోగిమంట కాస్తున్న స్థానికులు


బాడంగి: పోలీస్‌స్టేషన్‌వద్ద వేసిన భోగి మంట


తెర్లాం: మండల కేంద్రంలో భోగి మంట


రామభద్రపురం: భోగిమంటలో వేసేందుకు పిడకలు తీసుకెళ్తున్న చిన్నారులు


రాజాం సిటీ: మారుతీనగర్ భోగి మంట


సంతకవిటి: మందరాడలో భోగి మంట వద్ద చలి కాగుతున్న గ్రామస్తులు


రాజాం: కొత్తవలస పాఠశాల వద్ద భోగి పండగ చేసుకుంటున్న విద్యార్థులు


వంగర: భోగి మంట వద్ద యువత సందడి


బొబ్బిలి: చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న దృశ్యం


రాజాం సిటీ: భోగి మంటలో పిడకలు దండ వేస్తున్న పారిశ్రామికవేత్త గ్రంథి మల్లికార్జునరావు

ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: మండలంలోని గొంగాడవలసలో ఈనెల 10న వరినూర్పుడి యంత్రం కిందపడి మృతి చెందిన గోర్ల తిరుపతమ్మ, పోల లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శనివారం పరామర్శించారు. పార్టీ పరంగా అన్నివిధాలుగా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అలాగే ఇదే ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సత్యవతి, శ్రీదేవిల పరిస్థితిపై ఆరా తీశారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట చింతాడ సర్పంచ్ బంకురు తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మరడాన అప్పలస్వామి, దాలినాయుడు, కొట్నాన శ్రీను, జగ్గనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!


వంగర: కోలాటం మధ్య సీతారాముల చిత్రపటాల తిరువీధి


వంగర: గోదాదేవి కల్యాణం చేస్తున్న వేదపండితులు

వంగర: మండల కేంద్రంలోని రామాలయం వద్ద గోదాదేవి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై, వివాహ వైభవం తిలకించారు. అలాగే కోణంగిపాడు గ్రామ శ్రీరామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాములోరి కల్యాణం చూసేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు పోటీపడ్డారు. అనంతరం సీతారాముల చిత్రపటాలను వీధుల్లో ఊరేగించారు.

విద్యుత్ ధగధగలు



రాజాం పట్టణ ప్రధాన రహదారి విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. ఇటీవల బొబ్బిలి రోడ్డులో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను సంక్రాంతి పండగ పురస్కరించుకుని, ఎమ్మెల్యే కంబాల జోగులు శుక్రవారం ప్రారంభించగా, శనివారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న రోడ్డు చూపరులను తెగ ఆకట్టుకుంటోంది. – రాజాం సిటీ

తెలుగు సంప్రదాయాలు కొనసాగించడం ఆనందదాయకం


గజరాయునివలసలో జెండా ఊపి ఎడ్లపందాలు ప్రారంభిస్తున్న శంబంగి వేణు, బేబినాయన

బాడంగి: మండలంలోని గజరాయునివలస గ్రామస్తులు తెలుగు సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని కొనసాగించడం ఆనందదాయకమని వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్‌వీకేకే రంగారావు (బేబినాయన) అన్నారు. గజరాయునివలసలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఎడ్లపందాలను వీరు ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావడంతో ఎస్సై జయంతి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, సీఐ తిరుమలరావు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు, బొబ్బిలి మున్సిపాలిటీ కౌన్సిలర్ చోడిగంజి రమేష్, అభ్యుదయ కాన్వెంట్ కరస్పాండెంట్ సీహెచ్ శారద, ఎంపీటీసీ సభ్యురాలు పాలవలస గౌరు, ఎంపీడీఓ అక్కారావు, పాత్రికేయుడు కందుల శ్రీనివాసరావు, సర్పంచ్ సత్తిబాబు, మూడడ్ల సత్యనారాయణ, భాస్కరరావు, కామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


గజరాయునివలసలో భోగి రోజున పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ గౌరు

పేదలకు వస్త్రదానం

సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన మేలుకొలుపులలో భాగంగా గజరాయునివలస, ముగడ, బాడంగి గ్రామాలలో సేకరించిన బియ్యం, నగదుతో భోగి రోజున పేదలకు అన్నదానంతో పాటు వస్త్రదానం చేశారు.

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల అబ్జర్వర్‌గా పాలవలస

రేగిడి: మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల అబ్జర్వర్‌గా మండలంలోని పెద్ద శిర్లాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాలవలస రామచంద్రినాయుడును నియమితులయ్యారు. ఈ మేరకు రామచంద్రినాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అలాగే తనను నియమించిన పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు కృతజ్ఞతలన్నారు.

మద్యం తరలిస్తే కేసులు


తనిఖీలు చేపడుతున్న ఎస్‌ఈబీ సిబ్బంది

బొబ్బిలి: మద్యం విక్రయాలు చేపట్టినా, తరలించినా కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఈబీ సీఐ ఆర్. జైభీమ్ అన్నారు. శనివారం స్థానిక రాష్ట్రీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి నేపథ్యంలో మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


బాడంగి: పాఠశాలలో కలుసుకున్న1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా అదే పాఠశాల ఆవరణలో శనివారం కలుసుకున్నారు. చిన్నానాటి సంగతులను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో తెంటు ముసలినాయుడు, పోతాబత్తుల శ్రీనివాసరావు, యామల సూర్యకాంతం, పూడి పోలినాయుడు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

సందడే.. సందడి..

రామభద్రపురం: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 2002-2004 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ చదువుకున్న 150 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట స్థానిక సెయింట్ మేరీ స్కూల్ ప్రాంగణంలో కలుసుకున్నారు. వివిధ వృత్తుల్లో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో సందడి నెలకొంది.


రామభద్రపురం: ఆత్మీయ సమ్మేళనంలో 2002-04 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

బాలికల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలి

• డీఎస్పీ మోహనరావు

బొబ్బిలి: బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలని డీఎస్పీ బి. మోహనరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ, బాలికల్లో అక్షరాస్యత, విద్య, ఉద్యోగ సాధన పెరిగినప్పుడే సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక సంఘ మాజీ సభ్యులు తూముల భాస్కరరావు మాట్లాడుతూ, 21 మంది బాలికలకు లక్షా 26 వేల విలువగల సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి శ్రీహరి, ఎస్. అప్పలరాజు, కారుణ్య ఫౌండేషన్ సీఓ డేవిడ్ జే విక్టర్, కె.రామకృష్ణ, బి. లక్ష్మణరావు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ మోహనరావు, తూముల, తదితరులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రేగిడి:

మండలంలోని ఖండ్యాం గ్రామంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కోలాటం, ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గొలివి జగ్గునాయుడు, తంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

జగనన్న కాలనీకి విద్యుత్ వెలుగులు

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో ఉన్న జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయం కల్పించారు. శనివారం వైఎస్సార్ సీసీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు కాలనీలో స్విచ్ ఆన్ చేసి, ఇంటింటికీ విద్యుత్ ప్రసారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీ నారాయణరావు, ఏపీఈపీడీసీఎల్ రాజాం ఏడీ డీవీఎల్ ఫణీంద్రకుమార్, ఏఈ వి.సురేష్‌కుమార్, సర్పంచ్ ఎల్.రమాదేవి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


రాజాం: ముగ్గుల పోటీలు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో మారుతీ ఏజెన్సీ ఆధ్వర్యంలో సంతూరు కంపెనీ శనివారం ముగ్గులు పోటీలు నిర్వహించింది. భోగి పండగ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలకు మొత్తం 30 మంది హాజరై, ముగ్గులు వేసి ఆకట్టుకున్నట్లు నిర్వాహకులు బండి రామారావు, చీడి ప్రసాద తెలిపారు. సాయంత్రం విజేతలకు జెడ్పీటీసీ బి.నర్సింహులు చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలోసర్పంచ్ బి.బోడమ్మ, ఎంపీటీసీ బి.కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: భోగి పండగ సందర్భంగా మండలంలోని మిర్తివలస గ్రామంలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీనీరజ భూపతినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 120 మంది పాల్గొన్నారు. 25 మంది విజేతలను ఖరారు చేసి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రాజాపు చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు.